క్లుప్తంగా

మల్లన్న గుట్టపై పూజలు



మల్లన్నకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

కల్హేర్(నారాయణఖేడ్): సమృద్ధిగా వర్షాలు కురిసి బాగా పండాలని ఆదివారం మండలంలోని దేవునిపల్లి శివారులో మల్లన్న దేవుడికి పూజలు చేశారు. మాసాన్‌పల్లి గ్రామస్తులు బాజభజంత్రిలతో మల్లన్న గుట్ట వద్దకు చేరుకుని పూజలు చేశారు. వరుణదేవుడు కరుణించాలని భజనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఆత్మ చైర్మన్ దిలిప్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్, మోహన్‌రెడ్డి, కృష్ణాగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

నేటితో ముగియనున్న బియ్యం పంపిణీ

సంగారెడ్డి: చౌటకూర్ మండలంలో మూడునెలలకు సంబంధించి ఉచిత రేషన్ బియ్యం పంపిణీ నేటితో ముగియనుంది. మండలంలో 17 చౌకధరల దుకాణాలకు సంబంధించి 5,996 రేషన్ కార్డులు ఉన్నాయి. ఆయా కార్డుల్లో లబ్ధిదారులుగా ఉన్న వారందరికీ ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున బియ్యం అందజేశారు. ఇందుకు మూడునెలలకు సరిపడా ప్రభుత్వం ఒకేసారి మొత్తం 153 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించింది. దీంతో ఆయా గ్రామాల్లోని చౌకధరల దుకాణ డీలర్లు 94 శాతం మేరకు పంపిణీ పూర్తి చేశారు. ఇంకా ఎవరైనా ఉచిత బియ్యం పొందని వారు మిగిలితే ఈనెల 30లోగా సమీప రేషన్ డీలర్ల వద్ద తీసుకోవాలని చౌక ధరల దుకాణ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు దేవదాస్ కోరారు.

బాధితుడికి ఎంపీ పరామర్శ



భరత్‌సేట్‌ను పరామర్శిస్తున్న ఎంపీ

నారాయణఖేడ్: మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మహేంద్రకర్ వివేకానంద్ తండ్రి, ప్రముఖ వ్యాపారి మహేంద్రకర్ భరత్‌సేట్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ఆదివారం ఖేడ్ రాంవిలాస్ గల్లీలోని ఆయన ఇంటికివెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మద్యపాన నిషేధం




తీర్మానం చేస్తున్న యువత, గ్రామపెద్దలు

సంగారెడ్డి: బొమ్మరెడ్డి గూడెంలో ఆదివారం గ్రామంలోని తండా, ఊరిలో మద్యం షాపులు, బెల్ట్‌షాపులు బంద్ చేస్తూ తీర్మానం చేశారు. గ్రామంలో యువత, పెద్దలు కలిసి తీసుకున్న నిర్ణయానికి గ్రామస్తులు అందరు కట్టుబడి ఉండాలన్నారు. లేనిచో ఈ నిర్ణయాన్ని ఉల్లంఘిస్తే యాభై వేల రూ. 50 వేలు జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు.

మట్టి టిప్పర్లు సీజ్

కొండాపూర్(సంగారెడ్డి): అక్రమంగా మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్‌లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం రాత్రి మండల పరిధి హరిదాస్‌పూర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా కొంతమంది అక్రమార్కులు పట్టాభూమిలో నుంచి ఓ ప్రైవేట్ వెంచర్‌లకు మట్టిని తరలిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టే వారు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు ఎంత హెచ్చరించినా రెండు రోజుల నుంచి వాహనాలు సీజ్ చేస్తున్నప్పటికీ మండలంలో అక్రమ మట్టి తరలింపు ఆగడం లేదన్నారు. రాత్రి అయితే చాలు తొగర్‌పల్లిలో ఎర్రమట్టిని నర్సరీలకు తరలిస్తుండగా, గుంతపల్లిలో ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు



సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

మునిపల్లి(అందోల్): రాయికోడ్ మార్కెట్ కమిటీ గోదాం ప్రహరీ నిర్మాణానికి మంత్రి దామోదర నిధులు మంజూరు చేసినట్లు రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సంగారెడ్డిలోని ఆయన నివాసంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి కలిసి మంత్రిని శాలువాతో సన్మానించారు. నిధులు మంజూరు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తాటిపల్లి మైపాల్ పాల్గొన్నారు.

అధ్వానంగా జహీరాబాద్ రోడ్లు

- అడుగడుగునా గుంతలు
- కొత్త కమిషనర్లు దృష్టి సారిస్తారా?



గుంతలమయంగా మారిన మహీంద్రకాలనీ రోడ్డు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణం వేగంగా విస్తరిస్తోంది. అనేక సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పురపాలక పరిధిలో రోడ్లు దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయి. గుంతలు పడి పంట కాలువల వలె కోతలు ఏర్పడ్డాయి. సంవత్సరాలు గడుస్తున్నా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదు. ధ్వంసమైన రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

జహీరాబాద్ పట్టణంలో సుమారు లక్ష జనాభా, 37 వార్డులు ఉన్నాయి. వాహనాల రద్దీ కూడా ఎక్కువై ఎక్కడ చూసిన ట్రాఫిక్ సమస్య కనిపిస్తుంది. పట్టణంలోని ప్రధాన రోడ్లపై ఎక్కడ చూసిన గుంతలే కనిపిస్తున్నాయి. అంతర్గత రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైనా తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. పట్టణంలోని బ్లాక్ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం, కోర్టు, మున్సిపల్ కార్యాలయం, హౌసింగ్‌బోర్డు, దత్తగిరి కాలనీ, శాంతినగర్, హనుమాన్ మందిరం, భవానీ మందిరం తదితర కాలనీల్లో దశాబ్దాల క్రితం సీసీ రోడ్లు వేశారు. నాసిరకం పనుల కారణంగా త్వరగా గుంతలుపడ్డాయి. వాటర్ పైపులైన్, కేబుల్ తీగలు తదితర పనుల కోసం రోడ్లను అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. దీంతో రోడ్లు దెబ్బతిని గుంతలమయంగా మారుతున్నాయి. గుంతలు తవ్విన ప్రాంతంలో తిరిగి కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయడం లేదు. వర్షాలు కురిసినప్పుడు నీరు చేరి గుంతలు ఉన్న విషయం తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామ పంచాయతీ పరిధిలోని మహీంద్ర కాలనీ, ఆనంద్‌నగర్, కాలనీ, జర్నలిస్టు తదితర కాలనీల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. గుంతలు పడిన రోడ్లపై వెళ్లడానికి వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ పట్టణ రోడ్లపై దృష్టి సారిస్తే ప్రయోజనం ఉంటుందని పట్టణవాసులు కోరుతున్నారు.



దెబ్బతిన్న బ్లాక్ రోడ్డు

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి

తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్



గోపాల్ దంపతులను సన్మానిస్తున్న సురేశ్

జహీరాబాద్ టౌన్: పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అందించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ డిమాండ్ చేశారు. తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పట్లోళ గోపాల్ పదవీ విరమణ చేయగా ఆదివారం పట్టణంలోని ఆదర్శనగర్‌లో ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమానికి హాజరైన నవాత్ సురేష్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీ, సెలవు నగదు, పెన్షన్ వంటి ప్రయోజనాలు త్వరగా అందించాలన్నారు. గ్రాట్యుటీ చెల్లింపుల్లో జాప్యం కావడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బెనిఫిట్స్ పని దినం చివర రోజు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదవి విరమణ చేసిన టీచర్ గోపాల్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి, అడివప్ప రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బస్వరాజ్, నర్సింహారెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీపాల్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం

మునిపల్లి(అందోల్): తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా ఉన్న ముగ్గురు పిల్లలకు పీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పైతర సాయికుమార్ ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం మండలంలోని పెద్దగోపులారం గ్రామంలో ఇటీవల బేగరి రమేశ్, అనిత మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలైన సంఘటన పాఠకులకు తెలిసిందే. భవిష్యత్తులో ముగ్గురు పిల్లలకు ఏ అవసరం వచ్చిన పీఎస్‌ఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, మాజీ సర్పంచ్ బక్కన్న, మాజీ ఉపసర్పంచ్ శివరాజ్ పాల్గొన్నారు.

కాలనీల సమగ్ర అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు: నూతన కాలనీల సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తూ ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ బీహెచ్‌ఈఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల క్రితం ఏర్పడిన బీహెచ్‌ఈఎల్ మెట్రో ఎంక్లేవ్ కాలనీతో పాటు సమీప కాలనీల ప్రజల కోసం ఏడు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి మౌలిక వసతులు కల్పించామన్నారు. కాలనీలో గుడి, మసీదు, చర్చి నిర్మాణల కోసం రూ.30 లక్షల సొంత నిధులు అందించామని గుర్తు చేశారు. త్వరలో మరో రూ.70 లక్షల కేటాయించి నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 20 కాలనీలో ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందిస్తున్నామని.. మిగిలిన కాలనీలకు త్వరలోనే పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. నూతన కమ్యూనిటీ హాల్లో ఫ్లోరింగ్ నిర్మాణ పనులకు సొంత నిధులు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు సత్యనారాయణ, మల్లేశ్, బీహెచ్‌ఈఎల్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జూలై 21న పటాన్‌చెరులో బోనాలు



బోనాల తేదీని చదివి వినిపిస్తున్న అర్చకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరులో జూలై 21న ఆశాఢమాస బోనాలు నిర్వహించేందుకు పట్టణ పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించినట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. బోనాల పండుగ ఏర్పాట్లపై ఆదివారం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన పట్టణ పుర ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం తరపున అన్ని దేవాలయాల వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో.. ఆనందోత్సాహాల మధ్య పండుగను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా వారాహిదేవి మహోత్సవాలు



హోమంలో పాల్గొన్న దంపతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలం పరిధి ముంగి గ్రామ శివారులోని ఆదిలక్ష్మి ఆశ్రమంలో వారాహిదేవి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన ఆదివారం ఉదయం కుష్మండదేవికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన, చండీ హోమం, ఖడ్గ మలహవనం, కుష్మండదేవి కథ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్య తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఇసుక అక్రమ రవాణా

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఎల్లారం, రేజింతల్, నందికంది, సూరారం, ఆత్మకూర్ గ్రామాల్లోని వాగులో నుంచి అక్రమార్కులు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో అధికారుల కళ్లు కప్పివాగులో నుంచి ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

సంగారెడ్డి: సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి ప్రవీణ్ తెలిపారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోనీ డిగ్రీ పాసైన అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని, ఈ ఉచిత శిక్షణకు ఈనెల 16వ తేదీ నుంచి జూలై 8లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు 25 జూలై నుంచి 30 వరకు టీజీ బీసీ స్టడీ సర్కిల్, లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్ 500059లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 150 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని, ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, బోర్డింగ్, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ.5వేలు, స్టైఫండ్ రూ.5వేలు బుక్ ఫండ్ ఒక్కసారి మాత్రమే అందించనున్నట్లు, గ్రంథాలయ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు.

అధికార దుర్వినియోగం సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్ రెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గతంలో మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేపడుతూ కాంగ్రెస్ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడడం సిగ్గుచేటని, కనీసం ప్రోటోకాల్ పాటించడం లేదని 25వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేకంగా పర్యటించి తాము కోరిన విధంగా వార్డుల అభివృద్ధికి రూ. 25కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులను మంజూరు చేయించారు. అందులో భాగంగానే తమ 25వ వార్డుకు రూ. 40లక్షలను అభివృద్ధి పనులకు కేటాయించారు. ప్రస్తుతం ఆ నిధులతో 25వ వార్డులో కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వార్డు అభివృద్ధికి చిల్ల గవ్వ కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాచిరెడ్డి, వీరేశం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం ఆవరణలో చెత్తాచెదారం



గురుకుల ఆవరణలో వేసిన చెత్త, వ్యర్థాలు

సంగారెడ్డి క్రైమ్: ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యాచరణ పట్టణంలో జోరుగా సాగుతోంది. ప్రతిరోజు వార్డుల చొప్పున కార్యక్రమం జరుగుతుండగా కొన్నిచోట్ల మార్పు కనిపించడం లేదు. అధికారులు నామమాత్రంగా పనులు చేసి మమఅనిపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానిక కల్పకుంటలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకులం హాస్టల్ సమీపంలో చెత్త వేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు. గురుకుల ఆవరణ, చూట్టు పక్కల చెట్లు, ముల్లపొదలు పెరిగిపోవడంతో గురుకులం విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. గురుకుల ఆవరణలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేటు ఫీజు దోపిడీని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను పీడిస్తున్నారని సీపీఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి విద్యను వ్యాపారం చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు. ఓ వైపు కార్పొరేట్‌ను కట్టడి చేస్తూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తామని చెబుతున్నా ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు, పుస్తకాల ధరలు, ఏకరూప దుస్తుల పేరుతో దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. రాష్ట్రంలో బ్రాండ్ పేరుతో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేష్ గౌడ్, భూషణం, అనిల్ పాల్గొన్నారు.

ఇళ్లు అప్పగించకుంటే ఆందోళన చేస్తాం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు మహిపాల్

జహీరాబాద్ టౌన్: లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను అప్పగించకుంటే ఆందోళనకు దిగుతామని సీపీఎం డివిజన్ నాయకులు మహిపాల్ హెచ్చరించారు. పట్టణంలోని నిర్వహించిన లబ్ధిదారుల సమావేశం ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హోతి(కె) వద్ద పేదల కోసం ఇళ్లను కట్టించిందన్నారు. రెండు సంవత్సరాల క్రితం రెవెన్యూ అధికారులు డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపట్టి సర్టిఫికెట్లను పంపిణీ చేశారని తెలిపారు. ఇళ్ల నిర్మాణం పనులు పూర్తయినా లబ్ధిదారులకు అప్పగించకుండా జాప్యం చేస్తున్నారని వాపోయారు. ఇటీవల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయడంతో 20 రోజుల్లో అప్పగిస్తామన్న అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇళ్లను అప్పగించకుంటే జులై నుంచి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు సలీమోద్దీన్, బక్కన్న లబ్ధిదారులు పాల్గొన్నారు.

వీల్‌చైర్‌తో ప్రయాణం సంతోషం



వీల్‌చైర్‌తో బస్సు ఎక్కుతున్న రవికుమార్

పటాన్ చెరు టౌన్: దివ్యాంగులకు బస్సు ప్రయాణంలో వీల్‌చైర్‌తో ఎక్కేలా ర్యాంపు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తీవ్ర వైకల్య దివ్యాంగుడు రవికుమార్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ నుంచి ఇస్నాపూర్ 253/2 సర్వీస్ హెచ్‌లో దివ్యాంగుడు వికుమార్ తన బ్యాటరీ వీల్‌చైర్‌తో బస్సులో ప్రయాణం చేశాడు. ఆయన మాట్లాడుతూ.. ఈ సౌకర్యాన్ని దివ్యాంగులు ఉపయోగించుకోవాలంటే బస్సు కండక్టర్, డ్రైవరు సహకారం ఉంటేనే సాధ్యమవుతుందని తెలియజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1978-79లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు పలకరించుకొని వారి జీవన స్థితిగతులు పంచుకుని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు ప్రభాకర్, శ్రీశైలం, పూర్వ విద్యార్థులు తుల్జారాం సింగ్, శంకర్, బుచ్చప్ప, రవి, సురేష్, రాజు, రమేష్, వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రమణ పాల్గొన్నారు.

'నీటి అద్దం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సిద్ధారెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కవి యరుకుల యాదయ్య రచించిన 'నీటి అద్దం' పుస్తకాన్ని ఆదివారం రామచంద్రాపురంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ వ్యక్తికైనా అమితమైన ప్రేమను పంచగలిగే గొప్ప కవి యరుకుల యాదయ్య అని అన్నారు. కవి అంటే కవిత్వం ద్వారా లోకానికి ప్రేమను అందించాలన్నారు. ఆ పని చేయడంలో కవి యాదయ్య ముందుంటాడని తెలిపారు. కండ్లు ఉండాల్సిన చోట ఉంటేనే చాడాల్సినవి చూస్తాయని అప్పుడే మంచి కవిత్వం వస్తుందని వివరించారు. కవి యాదయ్య నిరాడంబరంగా, నిక్కచ్చిగా ఉంటారన్నారు. చాలా మంది ఒకరి నుంచి ప్రయోజనం పొందడం కోసమో, ఒకరి నుంచి మెప్పు పొందడం కోసమో తమ అభిప్రాయాలను ఈజీగా మార్చుకుంటారని తెలిపారు. కాని కవి యాదయ్య నమ్మిన విలువలను కట్టుబడి దేనికి రాజీపడబోరని వివరించారు. కార్యక్రమంలో తెరసం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం, శ్రీరాములు, నాయకులు బి.నాగేష్, కవులు సంపత్ కుమార్, యాదగిరి, లింగస్వామి, సతీష్, రఘురామి రెడ్డి, ఉషారాణి, రాఘవాచార్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల జాతర



బోనాల జాతరలో భక్తులు

సంగారెడ్డి: కుమ్మర్ల తొలి బోనాల జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. కుమ్మర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్, ఉప అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బోనాల జాతర మహోత్సవం నిర్వహించారు. పట్టణంలోని స్థానిక ఐబీ నుంచి బోనాల ఊరేగింపు అస్తబల్‌లోని ఎల్లమ్మ తల్లి ఆలయం వరకు మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. జాతరలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంతకిషన్, బీఆర్‌ఎస్ నేత చింత సాయినాథ్ పాల్గొని అస్తబల్‌లోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సెక్రటరీ మహేశ్, బాబయ్య, శంకర్, రమేష్, శ్రీను, అంజన్న, దర్శన్, శ్రీశైలం, సంఘం కుల పెద్దలు మహిళలు, యువకులు పాల్గొన్నారు.

గ్రామంలో రోడ్డు మరమ్మతులు



ప్రారంభమైన రోడ్డు పనులు

సంగారెడ్డి టౌన్: మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేట గ్రామంలో కొన్ని సంవత్సరాల నుంచి రోడ్డు సరిగ్గా లేక ప్రయాణికులు, గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. మాజీ సర్పంచ్ బలరాం ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా పరిశ్రమ వారి సహకారంతో ఆదివారం గ్రామంలోని చావడి వద్ద రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఇస్మాయిల్ ఖాన్ పేట నుంచి గ్రామ పరిధి వరకు తొమ్మిది లక్షల నిధులను మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో మంజూరు చేశారు. కొన్ని ఏళ్ల నుంచి ఉన్న ఇబ్బందులు తొలగడంతో గ్రామస్తులు పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.